# దాడి

చుట్టూ కొండలు. మధ్య లోయ, కొంచెం దూరంలో సెలయేరు. వీటి మధ్యలో పచ్చటి పచ్చిక మైదానం. ఆ పచ్చికలో పశువుల్ని మేపుతున్నాడు పదిహేనేళ్ళ కుర్రాడు సోమయ్య. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాళ్ళ వూరు కనిపిస్తుంటుంది.

అది జనవరి నెలలో ఓ సాయంకాలం. పడమటి ఆకాశంలో సూర్యుడు క్రమక్రమంగా ఎర్రగామారిపోతున్నాడు.

"గప్పుడే చలి మొదలైంది" అనుకున్నాడు సోమయ్య. నడుంకు కట్టుకున్న చిన్న పంచె తప్ప అతని శరీరం మీద మరే అచ్ఛాదనాలేదు.

"పొద్దుగూకంగనే దబ్బున యెడ్లను కొట్టంల గట్టేసి యింటికి పోవాలె. ఓ ఏపుల మండుతాంది. యింటికిబొయ్యేటోర్కు అమ్మేమన్న వండిపడెస్తదో... నన్నే వండుకొమ్మంటదో. అమ్మకు వంట్లె బావుంటలేదు. జ్వరం... దగ్గు.. ఎట్ల తక్కువైతదో యేమో...."అనుకున్నాడు సోమయ్య.

సోమయ్యకు ఒక్క తల్లి తప్ప ఈ లోకంలో నా అన్నవాళ్ళెవరూ లేరు. తండ్రెప్పుడో చిన్నప్పుడే చనిపోయాడు. ఆ తండ్రి చేసిపోయిన అప్పుకిందనే సోమయ్యను చాలా చిన్నప్పట్నించే రాఘవరెడ్డి దొరదగ్గర జీతం ఉంచింది వాళ్ళమ్మ. మొదట్లో సోమయ్య రాఘవరెడ్డి యింట్లోనే వాకిలూడ్చటం, అంట్లుతోమటం, నీళ్ళు చేదటం మొదలైన పనులుచేసేవాడు. కొంచెం పెద్దవాడయ్యాక సోమయ్యను వ్యవసాయం పనికి పంపించారు. రాఘవరెడ్డి జీతగాళ్ళందరిలోకి సోమయ్యే చాలా నమ్మకస్తుడన్న పేరు తెచ్చుకున్నాడు. తనకు నెలకు ఎంత జీతమిస్తారో, తన తండ్రి చేసిన అప్పు ఎంత వరకు తీరిందో మొదలైన విషయాలు సోమయ్యకు తెలియవు. అవన్నీ వాళ్లమ్మే చూసుకుంటుంది.

సోమయ్య ఆ రోజంతా మిగతా జీతగాళ్ళతో కలిసి రాఘవరెడ్డి వేసంగి పొలాన్ని దున్నాడు. ఇంకాసేపటికి పొద్దుగూకుతుందనగా నాగళ్ళు విడిచేసి మిగతా జీతగాళ్ళంతా ఎడ్లను కడిగేసి తాము స్నానాలు చేసి, ఎడ్లను మేపి, కొట్టంలో కట్టేసే పనిని తనకు అప్పగించేసి వెళ్ళిపోయారు. అందర్లోకి తనే చిన్నవాడు కావటం, దొరకు చాలా నమ్మకస్తుడన్న పేరు తెచ్చుకోవడం వల్ల తన మీద కొన్ని అదనపు బాధ్యతలు పడతాయని సోమయ్యకు తెలుసు.

"నాగండ్లిడిచి ఎక్కడోక్కడ బోతడు. అయిటంక వాళ్ళుజేసే పన్లన్నీ తనే జూడాలె. ఎక్కడ పొరపాటైనా దొర తననేతిడ్తడు" అనుకున్నాడు సోమయ్య.

బాగా ఆకలితో వున్న నాల్గు జతల ఎడ్లు చకచకా దట్టంగా పెరిగిన పచ్చగడ్డిని నమిలేస్తూ కొండమీద కెక్కుతోంటే వాటితో పాటే సోమయ్య కూడా వెళ్ళసాగాడు.

ఇంతలో కొంచెం దూరం నుండి సోమయ్యకు వాళ్ల దొర రాఘవ రెడ్డి రావటం కనిపించింది.

దొరరానే వస్తాండు. ఎడ్లను చీకటిపడేదాకా మేపమంటడు. కడుపు కింతబడ్తే తనెంత పని జెయ్యమన్నా జేస్తడు. తను పనికెన్నడూ భయపడడు.

రాఘవరెడ్డి వస్తూ వస్తూ ఆ రోజు జీతగాళ్ళు దున్నిపోయిన తన పోలాన్ని, ఆ తర్వాత అంతకు నెలరోజులముందే పోసిన వరినారును పరీక్షచేసుకొని సోమయ్య దగ్గరకు వచ్చాడు.

"యేంరా సోమా, నాగండ్లెప్పుడిడిచిండ్రురా?"

"జాము పొద్దుండె దొర."

"పొద్దుందాక దున్నినా నాల్గుమళ్ళన్నా కాలేదేంరా? దున్నిండ్రా, ముచ్చట పెట్టుకుంట కూచున్నరా?"

"దున్నినం దొరా."

"యేం దున్నిండ్రోరా, అసలు ఈ నాగళ్ళను తీసిపారేసి ఓ ట్రాక్టర్ కొంటేనే యేమన్న పనినడిచేట్టున్నది. ఇయ్యాళరేపు ఈ జీతగాని లమ్డీకొడుకులేమన్న పనిజేసేటట్టున్నరా? సంఘాలు, లీడర్లు, సమ్మెలు ఎవ్వన్నో నీ అసుంటోన్ని ఒక్కన్నో, ఇద్దర్నో ఉంచుకొని మిగిలినోళ్ళందర్నీ తీసిపారేస్త."

"గట్లజేస్తే వాళ్ళెట్ల బతుకుతరు దొరా?"

"బతకక యేమయ్యిందిరా. గవర్నమెంటోళ్ళు మీ అసుంటోళ్ళను ఉద్ధరించటానికి ఎన్నో ప్రోగ్రాములు పెడతనే ఉండ్రి. గవర్నమెంట్ భూములన్నీ మీకేనాయె- మా భూములకు గూడా సర్ప్లస్ అని జెప్పి మీకే ఇప్పిస్తుండ్రి, అప్పులన్నీ మీకేనాయె. స్కూళ్ళళ్ళ, కాలేజిళ్ళళ్ళ సీట్లన్నీ మీయేనాయె. ఇన్ని జేసినా మీకింకేదో తక్కువైపోతాందని రాడికల్సొచ్చిరి... అరెరెరె... ఆ ఎల్లకోడెనెవడో గట్ల గొట్టిండెవడ్రా?" అకస్మాత్తుగా రాఘవరెడ్డి దృష్టి తన ఎడ్లమీద పడింది.

"రామడు కొట్టిండు దొరా: అదియ్యాళ అస్సలు నడువలేదు. ఓపాలి పండుకుంది. రామడు భయ్యభయ్య బాత్తే లేచింది."

"ఆ రామడు లంజొడుకు ఇగ నా ఎడ్లను ఉంచడ్రా. కొట్టి కొట్టి చంపుతడు. మొన్ననే వెయ్యి రూపాయలు బోసి కొన్న కోడెను ఎట్లగొట్టి చంపేసిండేమురా... చర్మం వొలిచి పారేసిండు గాడిదకొడుకు."

"దొరజూస్తే తిడ్తడు. కొట్టకురా అని నేనెంత మొత్తుకున్నా వాడు ఇన్లేదు దొరా."

"దీన్ని గొట్టినట్టు వాన్నోసారి కొడ్తెగని వానికావరం అణుగుతదిరా.... ఇయ్యాళ రేపు వానికి వొళ్ళు దెలుస్తలేదురా. సంఘంల దిరుగుతాండటగదా?"

"యేమో దొరా, గా సంగతి నా కెరుకలేదు."

రాఘవరెడ్డి సోమయ్య మాట వినిపించుకోకుండా తన ఎడ్లనన్నింటినీ ఓసారి కళ్ళనిండా చూసుకోసాగాడు.

"సరెగని, ఎడ్లను ఇంకాస్సేపటిదాక మేపు. అప్పుడే కొంపలంటుకబోయినట్టు నా యెనకనే వచ్చి ఊర్లెబడకు. చీకటిపడేదాకామేపి, కొట్టంల కట్టేసిరా."

"గట్టనే దొరా!"

"కరెంటు మోటరున్న రూమ్‌కు తాళం వేసుకున్నవా?"

"వేసిన దొరా"

"ఇయ్యాళ కరెంట్ మంచిగొచ్చిందా? మధ్యల బందయిందా?"

"మంచిగనే వచ్చింది దొరా"

"నేను వూర్లెకుబోతున్న. గొడ్లను కడుపునింద మేయనీయ్.... నా తోకెంబడే వూర్లెకు రాకు. యేం?" గద్దించినట్టుగా అన్నాడు రాఘవరెడ్డి.

"గట్టనే దొరా" అన్నాడు సోమయ్య.

రాఘవరెడ్డి వూరి వైపుగా కదిలాడు.

గొడ్లను కడుపునిండ మేపాలే... తన కడుపు నిండిందో లేదో దొరకు అక్కర్లేదు.

రాఘవరెడ్డి వెళ్ళిన చాలా సేపటివరకు సోమయ్య ఎడ్లను మేపుతూనే వున్నాడు.

సూర్యుడు పశ్చిమాకాశంలో కృంగిపోయాడు.

మెల్లమెల్లగా ఆ కొండల నడుమ చీకట్లు ముసురుకోసాగాయి. చెట్టుకొకటి పుట్టకొకటి చొప్పున చీలిపోతున్న ఆ పశువుల్ని మరీ చీకటి పడిపోయిందంటే ఒకచోటికి చేర్చటం చాలా కష్టమని వాటినన్నింటిని ఒక దగ్గరకు చేర్చి కొట్టంవైపు మళ్ళించాడు సోమయ్య. ఆ పశువులనన్నింటిని పగ్గాలతో కట్టేసి, కొట్టానికున్న గేటు తలుపుల్ని బిగించి, వూరివైపుగా వేగంగా నడవటం మొదలెట్టాడు.

పగలంతా ఆకాశంలో ఎక్కడో దాక్కున్నాయన్నట్టుగా ఉండి పోయిన నక్షత్రాలు బయటపడి ఒకదానితో ఒకటి పోటీపడి మెరవసాగాయి.

చంద్రుని జాడెక్కడా లేదు.

కాలిబాటమీద సోమయ్య కొంచెం దూరం నడిచాడో లేదో ఎదురుగా ఎవరో వస్తున్న అలికిడైంది. ఎదురుగా వస్తున్న అతడు కొంచెం దగ్గరపడగానే సోమయ్య గుర్తుపట్టేశాడు. అతడు సమ్మయ్య మామ. సమ్మయ్య మామంటే సోమయ్యకు చాలా ఇష్టం. సమ్మయ్య కొంతకాలం పట్నంలో ఉండొచ్చాడు. వైద్యం చెయ్యటం నేర్చుకున్నాడు. అమ్మకు ఏదో వరుసకు తమ్ముడౌతాడట. వూళ్లో చాలా మంది రాత్రి పూట సమ్మయ్య ఇంట్లో చేరుతారు. ప్రపంచం మీది ఎన్నో విషయాలు సమ్మయ్య వాళ్లకు బోధిస్తూ ఉంటాడు. ఒకటి రెండు సార్లు సోమయ్య కూడా సమ్మయ్య ఇంటికి వెళ్ళి అతడు చెప్పే మాటలు విని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు. సమ్మయ్య మాటలు వింటున్నంత సేపూ బాగానే ఉంది. కాని అతడు చెప్పిన విషయాలేవీ సోమయ్యకు అర్థం కాలేదు.

"యేందే సమ్మయ్య మామ! గింత చీకట్ల ఎటో పోతున్నవు?" అడిగాడు సోమయ్య.

"ఎటోపోతున్నగని నీకెందుకింత పొద్దుపోయిందిరా సోమయ్యా?" అడిగాడు సమ్మయ్య.

"యేం జెయ్యమంటవే మామా! పస్దీరేటప్పటికి ఇంత సేపయ్యింది!"

"సరేగాని నువ్వు బో... నేనిప్పుడే వస్త...." అంటూ సమ్మయ్య ముందుకు నడిచాడు. సమ్మయ్య చేతిలో యేదో చిన్న మూటలాంటిది ఉందని గమనించాడు సోమయ్య.

"గింత రాత్రిపూట గీయనెటు బోతాండో" అనుకుంటూ సమ్మయ్య వెళ్ళిన వేపే కాస్సేపు చూస్తూ ఉండిపోయాడు సోమయ్య.

కొంచెం దూరం నడిచిన సమ్మయ్య యేమనుకున్నాడోగాని ఆగిపోయి వెనక్కి చూశాడు.

"అరే సోమా! గిక్కడిదాక బొయ్యొద్దాం- కాసేపు తోడురారా" అన్నాడు సమ్మయ్య.

"నేను రానే మామా, కడుపుల మండుతాంది. గింత తింటెగని వస్త."!

"గిప్పుడే మళ్ళీ బోదంగని రారా" సోమయ్య దగ్గరకొచ్చి అతని చెయ్యి పట్టుకుని బతిమాలుతున్నట్టుగా అన్నాడు సమ్మయ్య.

"ఎక్కడిదాకా బోవాల్నే"

"గా గుట్ట మీద్దాకనేరా!"

"గీ చీకట్ల గా గుట్టమీదికెందుకే?"

"రారా, నువ్వెన్నడూ చూడని చోటు చూపిస్త"

'ఎన్నడూ చూడని చోటు' అన్న మాట వినేటప్పటికే సోమయ్య తన అకలిని మరచిపోయాడు. చిమ్మని చీకటి - అడవిలో పన్జేసుకునే వాళ్ళంతా ఊరు చేరారు.... గుట్టమీదికి.... ఎప్పుడూ చూడని చోటు.... సోమయ్య ఊహకు చాలా పని దొరికింది. అతని ఆలోచనల వేగం పెరిగింది. మారు మాట్లాడకుండా సమ్మయ్యతో నడవసాగాడు.

"అరే! మనం గిప్పుడు ఎటుబోతాన్నమొ ఎవ్వరికీ తెలపొద్దు. ఎవరికన్న జెప్పితివో, నీ ప్రాణం, నా ప్రాణం... ఇద్దరి ప్రాణాలు పోతయి. యెరుకైందా?" అన్నాడు సమ్మయ్య.

"చచ్చినా జెప్పనే."

సోమయ్య తాము వెళ్ళేదెక్కడికో ఊహించటానికి ప్రయత్నిస్తున్నాడు. అతనిలో ఉత్సాహం యింకా యెక్కువైంది. యేదో గొప్ప ఘనకార్యం చెయ్యబోతున్నాననిపించిందతనికి. చాలా రోజులుగా ఆ గుట్ట మీదికి ఎవరో సంఘపోళ్ళు వస్తరని వాళ్ళు వీళ్ళు చెప్పుకోగా విన్నాడు. ఈ సంఘపోళ్ళంటే ఎట్టుంటరో... ఎట్ల మాట్లాడతరో చూడాలని సోమయ్య ఎన్నోసార్లు అనుకున్నాడు. సమ్మయ్య మామకు, సంఘపోళ్ళకు సంబంధాలున్నాయని కూడా అనుకోగా విన్నాడు.

"గిప్పుడు సమ్మయ్య మామ అక్కడికే పోతాండు. నేనియ్యాళ సంఘపోళ్ళను జూస్త–" ఈ ఆలోచన అతని బుర్రలోకి రాగానే ఒక వైపు సంతోషం, మరోవైపు భయం వ్యాపించాయి. తను సమ్మయ్యతో గలిపి గుట్టమీదకు పోయినట్టుదొరకు దెలిస్తే తనను చంపి పారేస్తడు. పోలీసులకు బట్టిస్తడు. సోమయ్య వణికిపోయాడు. తనను పోలీసులు బట్టుకపోతే తనమ్మ యేడ్చి గుండె బగిలి చచ్చిపోతది. అతనికి వెంటనే వెనక్కి తిరిగి పారిపోవాలనిపించింది. కాని అతనిలో తనకి తెలియకుండానే సమ్మయ్యతోటే వెళ్ళాలన్న కోరిక బలపడసాగింది.

"నీ చేతిల గా మూటేందే మామా?" అడిగాడు సోమయ్య.

"అన్నంరా– ఇయ్యాళ రాత్రికి మన విశ్వంబాబు ఈ గుట్టమీద మకాం పెడ్తడని, అన్నం తీసుకరమ్మని నాకు కబురు చేసింద్రు" చెప్పాడు.

ఆ మాట వినగానే సోమయ్య గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

"మామా, నాకు తెల్వకడుగుతా– ఈ ఇశ్వం బాబు వాళ్ళు యేం జేస్తరే?"

"యేం జేసినా మనకోసమేరా! మీ రాఘవరెడ్డి దొరకు ఫస్ట్‌క్లాసైన 50 ఎకరాల భూముంది. నీకూ నాకూ ఉందా? చలిబెడ్తాంటే కప్పుకోవటానికి నీ వంటి మీద ఓ అంగైనా లేదు. రాత్రింబవళ్ళు గొడ్డు చాకిరి జేస్తావేంటే మీ దొర నీకేమిస్తాండు? నీ కష్టాన్ని దోచుకుని బంగ్లాలు కడతడు. విశ్వంబాబు వాళ్ళు ఈ దోపిడిని అంతం జేస్తరు. వానసుంటోళ్ళ భూమి గుంజుకొని మనసుంటోళ్ళకు పంచుతరు."

"ఆయన భూమి గుంజుకుంటె దొర ఊరుకుంటడా? పోలీసులను దీసుకురాడూ?"

"తీసుకొస్తడు. వాళ్ళను, పోలీసులను అంతంజేసే రోజులొస్తయి."

"గట్లయితే మరి గీ సంఘపోళ్ళు గీ గుట్టళ్ళ ఎందుకు దాక్కుంటరే."

"గిప్పుడు గుట్టలపంటే ఉంటరు– రేపు మన రాజ్యం వచ్చినంక బయటకొచ్చి వాళ్ళే మంత్రులౌతరు. మనసుంటి పేదోళ్ళను పైకి తెస్తరు."

సోమయ్య ఆలోచించసాగాడు. గదంతా నిజంగా జరుగుతదా? జరిగితే ఎంత బావుండు!

సమ్మయ్య ఆ గుట్టమీద దట్టమైన చెట్ల మధ్యలోంచి దారిచేసుకుంటూ చాలా దూరం నడిచాక ఒకచోట ఆగి చుట్టూ కలయజూశాడు. చుట్టూ వూళ్ళూ, చెట్లూ– దూరంగా వూళ్లో వెలుగుతున్న దీపాలు.... మొరుగుతున్న కుక్కల చప్పుడు– ఆకాశంలో అమాయకంగా మెరుస్తున్న చుక్కలు– ఇవి తప్ప దగ్గర్లో ఎక్కడా మరో మానవ ప్రాణి అంటూ లేదని నిర్ధారణ చేసుకున్నాక సమ్మయ్య చేతిలోకి చిన్నరాయి తీసుకొని పక్కనే ఉన్న బండ మీద రెండుసార్లు ఓ విచిత్రమైన ధ్వని చేశాడు.

ఎక్కడో చీకట్లోంచి "సమ్మయ్యా! లోపలకు రా" అన్న మాట వినిపించడంతో సోమయ్య ఉలిక్కిపడ్డాడు. అతనికి తన కళ్ళముందు ఏదో మహాద్భుతం జరుగబోతున్నట్టుగా తోచింది.

సమ్మయ్యతోబాటు సోమయ్య కూడా ఆ బండరాళ్ళ మధ్యలోంచి ముందుకు నడిచాడు. ఆ రాళ్ళ మధ్య సందులోంచి టార్చ్‌లైట్ వెలుగు కనిపించటంతో సోమయ్య మంత్రముగ్ధుడిలా మారిపోయాడు. అంత దట్టమైన కారు చీకట్లో అకస్మాత్తుగా ఆ కాంతిరేఖ కనిపించడం అతని కళ్ళకెంతో అపురూపమైన దృశ్యంగా తోచింది.

ఆ టార్చ్‌లైట్ వెలుగు ఆధారంగా వాళ్ళిద్దరూ ఆ గుహలోకి చేరుకున్నారు.

ఆ గుహలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ఆ ముగ్గురూ సోమయ్య కళ్ళకు మామూలు మానవ మాత్రులుగా కనిపిచలేదు. యే మరో ప్రపంచంలోంచో ఈ లోకంలో అవతరించిన దేవతామూర్తుల్లా తోచారు. అతడు ఆ ముగ్గుర్నీ అత్యంత ఆశ్చర్యంతో చూడసాగాడు.

ఆ గుహలో ఓ మూల చిన్న దీపం వెల్గుతోంది. వాళ్ళు ముగ్గురూ వయసులో చాలా చిన్నవాళ్లే. ఒకతను చాలా గుబురైన గడ్డం పెంచాడు. తెల్లగా, ఎత్తుగా, అందంగా, ఎంతో ఉన్నత కుటుంబానికి చెందినవాడిలా కనిపించాడు. గళ్ళ లుంగీ కట్టుకుని, స్వెటర్ వేసుకున్నాడు. రెండో అతను వయస్సులో కొంచెం పెద్దవాడిగా కనిపించాడు. గళ్ళలుంగీ కట్టుకుని, కాకీషర్టు వేసుకున్నాడు. ఉంగరాల జుట్టు, లావుగా నల్లగా ఉన్నాడు. చేతిలో తుపాకీ పట్టుకుని దాన్ని శుభ్రం చేస్తున్నాడు. మూడో వ్యక్తిది ఇంచుమించు తన వయస్సే. కాకీ షర్టు, నిక్కరు వేసుకున్నాడు. అతని చేతిలోనే పొడవైన టార్చిలైట్ ఉంది.

"ఎవరో కొత్త వ్యక్తిని తీసుకొచ్చావు? ఎవరతను-?" అడిగాడు గడ్డం వ్యక్తి.

"వాడు మా అక్క కొడుకే విశ్వంబాబూ! రాఘవరెడ్డి దగ్గర జీతం ఉంటున్నడు. ఎప్పుడన్న మనకు ఎమర్జెన్సీల పనికొస్తడని తీసుకొచ్చిన."

"నమ్మకమైనవాడేనా?"

"చాలా నమ్మకస్తుడండి- మనం గీసిన గీటు దాటడు" అన్నాడు సమ్మయ్య తను తెచ్చిన చద్దిమూట విప్పుతూ...

"ఇంత చలేస్తోంటే వంటిమీద ఓ షర్టులేదూ, దుప్పటిలేదు- ఎలా భరిస్తున్నావోయ్" అన్నాడు విశ్వం సోమయ్య మీదకి తన పక్కనే ఉన్న ఓ బ్లాంకెట్‌ను విసిరేస్తూ.

"వానికి చలేమిటి?..... రాత్రింబవళ్ళు చాకిరీచేసి చేసి వాడి శరీరం ఎండా, వానా, చలి మొదలైనవాటిని మరచిపోయింది" అన్నాడుసమ్మయ్య. సోమయ్యకు ఆ బ్లాంకెట్‌ను తీసుకొని కప్పుకోవాలో లేక అలాగే వదిలెయ్యాలో అర్థం కాలేదు.

"రాఘవరెడ్డి నెలకు నీ కెంత జీతమిస్తాడోయ్?" అడిగాడు విశ్వం.

ఆ ప్రశ్న విశ్వంబాబు తననే అడుగుతున్నాడని తెలియడంతో సోమయ్యకు వణుకు ప్రారంభమైంది.

"వాడికి జీతం గీతం యేం లేదండి. వాని నాయన వెన్కటికి రాఘవరెడ్డి దగ్గర ఓ ఐదొందలు అప్పుతీసుకున్నాడట. దానికింద వీళ్ళమ్మ జీతం ఉంచింది" చెప్పాడు సమ్మయ్య.

"అంటే కట్టుబానిసన్న మాట!" అన్నాడు టార్చ్‌పట్టుకున్న కుర్రాడు.

చద్ది విప్పి, మూడు గిన్నెల్లో అన్నంపెట్టి, వాళ్ళు ముగ్గురి ముందు పెట్టాడు సమ్మయ్య. వాళ్ళు ముగ్గురూ అన్నం తినడం మొదలుపెట్టారు.

ఆ ముగ్గుర్నీ అలా ఆ గుహలో, ఆ పరిసరాల్లో, ఆ వాతావరణంలో చూస్తోంటే సోమయ్యలో ఏదో సంభ్రమం, ఏదో భయం, ఏదో ఉత్సుకత, ఏదో ఆశ్చర్యం ఇలా ఎన్నో అనుభూతులు కల్గాయి. వాళ్ళు తింటున్నంత సేపూ వాళ్ళనే రెప్పవాల్చకుండా చూస్తూ ఉండిపోయాడు.

భోజనం చేస్తూ వాళ్ళు యేవేవో విషయాలు మాట్లాడుకున్నారు. వాళ్ళ ఊళ్ళో యేం జరుగుతున్నదో సమ్మయ్యను అడిగి తెలుసుకున్నారు. రోజుకూలీ ఎంతిస్తున్నారని, రాఘవరెడ్డి, వెంకటేశ్వరరావు మొదలైన వాళ్ళకు ఎంత భూముందని, వాళ్ళు జీతగాళ్ళని ఎలా చూస్తారని ఇలా ఎన్నో విషయాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మయ్య వాళ్ళ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పాడు.

వాళ్ళ భోజనాలు అయిపోగానే గిన్నెలన్నీ సర్దేసి మూటగట్టాడు సమ్మయ్య.

"నువ్వు కాస్సేపు బయట నిల్చోరా... నేనిప్పుడే వస్త" అన్నాడు సోమయ్య నుద్దేశించి.

సోమయ్య మరోసారి ఆ ముగ్గుర్నీ కళ్ళనిండా చూసి బయటకు వెళ్ళబోయాడు.

"ఆ బ్లాంకెట్ తీసుకెళ్ళు" అన్నాడు విశ్వం.

"వాడా బ్లాంకెట్‌తో ఊల్లకి బోతే అదెక్కడిదని అడ్గుతరు- వద్దులెండ్రి. నువ్వు బయట నిలబడు పో" అన్నాడు సమ్మయ్య.

సోమయ్య బయటకొచ్చి నిల్చున్నాడు. లోపల వాళ్ళు చాలా సేపు మాట్లాడుకున్నారు. వాళ్ళు మాట్లాడుకుంటున్నదేమిటో అతనికి వినిపించలేదు. అసలు అక్కడికి దగ్గర్లో ఎవరో మనుషులున్నట్లే అనిపించటంలేదు.

"వీళ్ళు భలే చోటు చూసుకున్నరు" అనుకున్నాడు సోమయ్య.

ఓ గంట తర్వాత సమ్మయ్య బయటకొచ్చి 'ఇకపోదాంపారా' అన్నాడు.

సోమయ్య సమ్మయ్య వెనకాలే నడిచాడు. ఇద్దరూ కొండదిగి అర్ధరాత్రి దాటుతుండగా ఊరుచేరారు.

"అప్పుడప్పుడు మాకేదన్న పనిబడ్తే నువ్వు చేసిపెట్టాల్రా సోమా" అన్నాడు సమ్మయ్య.

"వద్దు మామా! నాకిప్పుడే చచ్చేంత భయం పుట్టింది. ఇట్లాటిపని నాకు మళ్ళ చెప్పొద్దు" అన్నాడు సోమయ్య.

"సరెగని జాగ్రత్త! ఈ సంగతి ఎవరికీ తెలవొద్దు."

"నాకు గా మాత్రం తెలియదానే మామా?"

వాళ్ళిద్దరూ విడిపోయారు.

సోమయ్య తన గుడిశెకు చేరేటప్పటికి వాళ్ళమ్మ ఇంకా నిద్రపోలేదు.

"యేందిరాసోమ, ఇంతసేపు ఎక్కడబోయినవురా. నాకు భయంబుట్టి దొరింటికి బోయి అడుగుదమనుకుంటే, చాతకాలేదు. లేస్తే వొళ్ళు తిరిగిపడిపోతాననుకున్నా."

" నీ అవ్వ, ఎక్కడ బోలేదుగనీ నువ్వు పండుకోవే... ఇంతేమన్న వొండినవా?" అన్నాడు సోమయ్య.

"ఉట్టిమీద పెట్టిన- పెట్టుకోని తిను" అంటూ ఆమె దగ్గటం మొదలుపెట్టింది.

సోమయ్య అన్నం తిని, ఓ పాత దుప్పటి కప్పుకొని పడుకొని నిద్రపోయాడు.

.... ... ...

సోమయ్య ఊళ్లో ఎప్పుడూ ఏవో సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. వాటినన్నిటినీ సోమయ్య గమనిస్తూనే ఉన్నాడు.

జీతాలు పెంచాలని జీతగాళ్ళు సమ్మెచేశారు. ఓ వారం రోజులు బిర్రబిగుసుకొని కూర్చున్న భూస్వాములు దిగొచ్చి జీతాలు పెంచారు.

పక్క ఊర్లో ఎవర్నో హత్య చేసిన అన్నలు ఆ ఊరికొచ్చి ఎవరింట్లోనో దాక్కున్నారని అనుమానించిన పోలీసులు అకస్మాత్తుగా వచ్చి ఊరంతా గాలించి వెళ్ళారు. మొట్టమొదలు సమ్మయ్య ఇంటికే వచ్చారు.

సమ్మయ్యతో పట్నంలో చదువుకొని వచ్చిన ఓ ఐదారుగురు యువకులు కూడా చేరి, ఆ ఊరి విషయాల్లో జోక్యం చేసుకోసాగారు.

ఈలోగా ఆ వూళ్లో మరో సంఘటన జరిగింది.

వెంకటేశ్వరరావనే ఆ ఊరి భూస్వామి తనకున్న భూమిలో ఓ ఐదెకరాలు అమ్మెయ్యాలని నిర్ణయించుకున్నాడు. అతడు అమ్మదల్చుకున్న భూమిని కొనటానికి ఆ ఊళ్ళోని చాలా మందే సిద్ధమయ్యారు. చివరకు 15 వేలకు ఎకరం చొప్పున కొమురయ్యకు అమ్మటానికి ఒప్పందం కుదిరింది. కొమురయ్య వెంకటేశ్వరరావుకు కొంత ఎడ్వాన్స్ కూడా ఇచ్చాడు.

ఈ విషయం తెలియగానే సమ్మయ్య అతని అనుచరులు కొమురయ్యను, వెంకటేశ్వరరావును పంచాయితీ బోర్డు ఆఫీసుకు పిలిపించారు.

"15 ఎకరాలకంటె ఎక్కువ భూమి ఉన్నోళ్లెవరూ భూములు అమ్మొద్దని మా పార్టీ తీర్మానించింది. కాబట్టి అలాంటి అమ్మకాలకు మేం ఒప్పుకోం. ఎవడన్నా కొంటే వాన్ని ఆ భూమిని దున్నుకోనియ్యం. యేమండి వెంకటేశ్వరరావుగారూ, మీరు భూమిని అమ్ముతున్నారట నిజమేనా?" అన్నాడు సమ్మయ్య.

"నిజమే. భూమి అమ్మంది నాకు వెళ్ళేటట్టులేదు. నేను నా బిడ్డ పెండ్లి చేద్దామనుకుంటున్న" అన్నాడు వెంకటేశ్వరరావు.

"నువ్వు బిడ్డ పెండ్లి జెయ్యవు. యేం జెయ్యవు... పట్నంల ప్లాట్లు కొంటవు. బంగ్లాలు గడ్తవు. కిరాయికిస్తవు. గదంతమేం ఒప్పుకోం" అన్నాడు సమ్మయ్య.

"అంటే... ఈ దేశంల ఇగ మీదే ప్రభుత్వమా? యిగ వేరే ప్రభుత్వం లేదా?" అన్నాడు వెంకటేశ్వరరావు.

"ఔను. మాదే ప్రభుత్వం. ఎప్పుడు మీదే ఉంటదనుకున్నరా.... యేంరా కొమురయ్య, చూస్తుండగనే నువ్వెంత పెద్దోనివైపోతివి. దొరల భూములు కొనేటోనివైపోతివి. నువ్వు కొనేది లేదు. ఆయన అమ్మేది లేదు" అన్నాడు సమ్మయ్య.

"నాకు గిదంతేం యెరుక? వెయ్యిరూపాయలు బయానిచ్చినగదా" అన్నాడు కొమురయ్య.

"బయానలేదు. గియాన లేదు. నీ బయాన నువ్వు దీసుకో."

"గంతేనంటారా?"

"గంతేమల్ల!"

"నా బయాన నాకియ్యుండ్రి దొరగారు, నాకు మీ భూమొద్దు, గీమొద్దు" అన్నాడు కొమురయ్య.

"మంచిది, నీ డబ్బు ఎక్కడికి పోదు. ఈ ఊళ్ళో యిక మీదే రాజ్యమైపోయినట్టుంది. యేలుండ్రి. మీరే యేలుండ్రి!" అంటూ వెంకటేశ్వరరావు అకన్నించి కోపంగా వెళ్ళిపోయాడు.

ఊళ్ళో అందరూ సమ్మయ్య వెంకటేశ్వరరావంతటి వాన్ని పంచాయితిబోర్డు ఆఫీసు దగ్గరకు పిలిపించి భూమి అమ్మొద్దని చెప్పాడనీ, తీసుకున్న బయానను వాపసు యిప్పించాడని గొప్పగా చెప్పుకున్నారు.

ఇది జరిగిన వారం రోజుల తర్వాత ఆ ఊరికి ఒక రోజు పొద్దున్నే అకస్మాత్తుగా పోలీసులొచ్చారు. సమ్మయ్యను, అతని అనుచరుల్ని పారిపోవటానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకొని జీపెక్కించారు. అప్పుడే లేచి పొలంవైపు వెళ్తున్న సోమయ్యకు ఇదంతా చూస్తోంటే చాలా భయమేసింది.... "వీళ్ళందర్నీ పోలీసులు స్టేషనుకు తీసుకుపోయినంక బాగ కొడ్తరట... చిత్రహింసలకు గురిచేస్తరట. ఊళ్ళో వాళ్లు వీళ్లు చెప్పుకోగా విన్నాడు. పాపం... సమ్మయ్య మామను ఎంత కొడ్తరో... ఇలా ఆలోచించుకుంటూ సోమయ్య తన పనికి వెళ్ళిపోయాడు.

అదే రోజు సాయంత్రం.... సోమయ్య గుట్ట పక్కనే రోజూలాగే ఎడ్లను మేపుతున్నాడు.

"అరె సోమయ్యా! నీతో ఓ పనుందిరా" అంటూ అతని దగ్గరకు దుర్గయ్యొచ్చాడు.

దుర్గయ్య ముసలాడు. కమ్మరి పనిచేస్తాడు. సమ్మయ్య ఇంటిపక్కన దుర్గయ్య ఇల్లుంది. ఊళ్ళో తప్ప దుర్గయ్యెప్పుడూ అడివిలో కనబడడు. అలాంటి దుర్గయ్యకు తనతో పనిబడిందంటే చాలా ఆశ్చర్యమేసింది.

"నాతో యేంపనే దుర్గయ్య తాతా, గింత దూరం వచ్చినవ్.... పాపం నీకు నడవనే వస్తలేదు" అన్నాడు సోమయ్య.

"గట్టిగా మాట్లాడకు. మీ మామ సమ్మయ్య ఇయ్యాళ వూళ్లో పోలీసులొచ్చింద్రని తెలవంగనే నన్ను బిలిచిండు. నీతో ఓ మాట జెప్పమన్నడు. ఈ రాత్రికి విశ్వంబాబు వాళ్ళు యీ గుట్టమీదనే ఉంటరట. పరిస్థితి బాగలేదు. వెంటనే వాళ్ళుండేకాడికి నిన్ను బొయ్యి చెప్పిరమ్మన్నడు. వాళ్ళుండేచోటు నీకు జూపించిండటగదా" అన్నాడు దుర్గయ్య.

దుర్గయ్య చెప్పిన మాట వినగానే సోమయ్య శరీరమంతా గగుర్పొడిచింది. తన నరనరాల్లో రక్తం ఉప్పొంగి వేగంగా ప్రవహించింది. ఒకవైపు భయం, వీళ్ళంతా కలిసి తననేదో ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని.... మరోవైపు, పాపం వాళ్ళను రక్షించాలని.

"ఇయ్యాళ పట్టుకుపోయిన పోరగాళ్ళను పోలీసు స్టేషన్ల పడేసి మస్తు కొడ్తరు. అండ్ల ఎవడో ఒకడు దెబ్బలకు తాళలేక విశ్వంబాబుండే చోటు చెబుతడు. పోలీసులొచ్చి వాళ్ళను పట్టుకుంటరు. నువ్వు దబ్బున బోయి వాళ్ళను యెల్లిపొమ్మని చెప్పిరా పో!" అన్నాడు దుర్గయ్య.

నిజమే. తనువెంటనే వెళ్ళకపోతే వాళ్ళు పోలీసులకు పట్టుపడ్తరు. అలా జరగటానికి వీల్లేదు. విశ్వంబాబెంత మంచివాడు. అసలతడు మామూలు మనిషికాదు-దేవుడు.

"మరి నా యెడ్లనెవరు జూస్తరే దుర్గయ్య తాతా"!

"నేను జూత్తగని, నువ్వు దబ్బున బొయిరా పోరా, పోలీసులు రానే వస్తరు" అన్నాడు దుర్గయ్య.

"ఎడ్లను మంచిగ చూడే. పొలంల బడ్డయంటే మా దొర జంపేస్తడు. అప్పుడప్పుడు గీయేళ్ళప్పుడు మా దొర వచ్చినా వస్తడు. దబ్బున దొరొస్తే నేను ఏట్లే మంచినీళ్ళు దాగిరాను బోయిన్నని చెప్పు."

"గట్లనేగని నువ్వు దబ్బున బోరా"!

సోమయ్య కొండమీదికి పరుగెత్తాడు. చెట్లను, రాళ్ళను తప్పించుకుంటూ తన శక్తినంతా కూడదీసుకొని వేగంగా, అతివేగంగా గుట్టెక్కసాగాడు. ఆ గుట్టమీదున్న ప్రతి చెట్టూ, ప్రతి పుట్టా, ప్రతిరాయి, ప్రతి రప్పా అతనికి చిన్నప్పట్నించి తెలిసినవే. అందుకే ఒక్కసారే చూసినప్పటికి ఆ దట్టమైన అడవిలోని ఆ ప్రదేశాన్ని 20 నిముషాల్లో చేరుకోగల్గాడు. ఇదివరకొచ్చినప్పుడు సమ్మయ్య చేసినట్టుగానే బండమీద కొట్టి చప్పుడు చేశాడు. వెంటనే లోపల్నుంచి తుపాకిపట్టుకున్న ఓ వ్యక్తి బయటకొచ్చాడు.

"ఇక్కన్నించి దబ్బున యెల్లిపొండ్రి. పరిస్థితి బాగలేదు. ఇయ్యాళ మా సమ్మయ్య మామను, ఇంక కొందర్ని పోలీసులు పట్టుకుపోయిండ్రు. మిమ్మల్ని యెళ్ళిపొమ్మని సమ్మయ్య మామ చెప్పమన్నడు. మీరు యెల్లిపొండ్రి, యెల్లిపొండ్రి."

తను చెప్పదలుచుకున్న విషయం గబగబా చెప్పేసి వెంటనే గిరుక్కున వెనక్కి తిరిగి గుట్ట కిందికి పరుగెత్తాడు.

గుట్టదిగి తన ఎడ్లను సమీపించటానికి అతనికి పది నిముషాలు మాత్రమే పట్టింది. ఏమీ జరుగనట్టుగానే అతడు ఎడ్ల దగ్గరకు రాబోయాడు. తన ఎడ్లన్నీ యథావిధిగా గడ్డిమేస్తున్నాయి. కాని యేదో జరిగింది. దొర రానే వచ్చిండు. దుర్గయ్య తాతను యేదో అడుగుతనే వున్నడు. ఎక్కడికి బోయిననో చెప్పమని తనను అడుగుతడు. దుర్గయ్య మాట నమ్మడు. నిజం చెప్పమని తనను కొడతడు. చంపుతడు, ఇదివరకొకసారి తనేదో పొరపాటు చేస్తే దొర కొట్టిన దెబ్బలు గుర్తొచ్చాయి. వాడికి వెంటనే ఎటైనా పారిపోదామన్న బుద్ధిపట్టింది. కానీ ఇప్పుడిక లాభం లేదు. వాళ్ళదొర వాడిని చూడనే చూశాడు.

"అరేయ్ సోమా! ఎడ్లనిక్కడ వదిలిపెట్టి గుట్టకెందుకు బోయినవురా. అక్కడెవడన్న నీ చుట్టమున్నడా? అసలిక్కడికి గీ దుర్గడెందుకొచ్చిండు? నువ్వు గుట్టమీదికి బోతే దుర్గడేమో మంచినీళ్లు దాగబోయినవంటున్నడు. మీ నాటక మేమిటిదొ నాకు దెలుస్తలేదు" గద్దించాడు రాఘవరెడ్డి.

"ఎటు బోలేద్దొరా, కడుపుల తిప్పినట్టయితే గా గుండు చాటుకు..." సోమయ్య నోట్లోంచి మాట సరిగ్గా రావటంలేదు. వాడు అబద్ధం చెబుతున్నాడని రాఘవరెడ్డికి వెంటనే అర్థమైపోయింది. వాడేదో రహస్యం దాస్తున్నాడు. అదేమిటో తను కనుక్కోవాలి అన్న పట్టుదల అతనిలో ఎక్కువైంది.

"అరేయ్... నీ అసుంటోడు అబద్ధం చెబితే వెంటనే తెలిసిపోద్దిరా. నిజం చెప్పు. లేకపోతే చంపేస్త. గుట్టమీదికిబోయి ఎవన్ని కలిసినవ్? నిజం చెప్పు. అబద్ధం చెప్పినవో ఛస్తవు. చెప్పు" అంటూ రాఘవరెడ్డి చటుక్కున సోమయ్య చెయ్యి పట్టుకున్నాడు. దొర తన చేయి పట్టుకోవటంతో కోత కోసం దొరికిన కోడి పెట్టలా నిలువెల్లా భయంకరంగా వణికిపోయాడు సోమయ్య. భయంతో పూడుకుపోయిన అతని గొంతుపెగిలి మాట రావటంలేదు.

"నన్ను వదిలిపెట్టుండ్రి దొరా. నాకేం ఎరుకలేదు. నన్ను కొట్టకుండ్రి.... చంపకుండ్రి."

"ఎక్కడికి బోయినవో చెప్పురా. నిన్ను కొట్ట, చంప, నిజం చెప్పు. అసలీ దుర్గడెందుకొచ్చిండు?" అని పక్కకు చూస్తే అక్కడ దుర్గయ్యలేడు.

"చూసినవా? వాడప్పుడే దెంకపోయిండు. నువ్వు మంచోనివనుకున్న. వీండ్ల సంఘంల గల్వవనుకున్న. నీకు గింత తెలివెప్పుడొచ్చిందిరా, గాడ్దెకొడకా" అంటూ రాఘవరెడ్డి తన శక్తికొద్దీ సోమయ్యను కొట్టసాగాడు.

"నాకేం ఎరుకలేద్దొరా. నన్ను విడిచిపెట్టుండ్రి. నన్ను కొట్టకుండ్రి" కొండలన్నీ ప్రతిధ్వనించేలా రోదించాడు సోమయ్య.

కాని రాఘవరెడ్డి అతన్ని వదిలిపెట్టలేదు. అతని చేతిలో ఉన్న బెత్తంతో కొడుతూనే వున్నాడు.

ఇంతలో అక్కడికి అతి వేగంగా రెండు పోలీసు జీపులొచ్చాయి. ముందొచ్చిన జీపులో సాయుధులైన పోలీసుల మధ్య ఆ ఉదయం ఆ వూర్లోంచి అరెస్టుచేసి తీసుకుపోబడిన ఓ కుర్రాడుకూడా వున్నాడు. జీపులు ఆగగానే రిజర్వ్ పోలీసులందరూ గబగబా దిగారు. వాళ్ళను లీడ్ చేస్తున్న ఎస్.ఐ. రాఘవరెడ్డి దగ్గరకొచ్చాడు.

"విశ్వంబాబు పార్టీ ఈ రాత్రికి ఈ గుట్టుమీదనే క్యాంపేస్తున్నరట. నా కొడుకులు, ఈ సారికిక తప్పించుకోలేరు" అన్నాడు. నువ్వోపిచ్చోడివి అన్నట్టుగా నవ్వాడు రాఘవరెడ్డి.

"వాళ్ళెప్పుడో తప్పించుకున్నరు. ఇగో-వీడు బొయి చెప్పొచ్చిండు. చెట్టుకోడు, పుట్టకోడు. ఎక్కడ జూసినా వాళ్ళ మనుష్యులే" అన్నాడు రాఘవరెడ్డి.

"వీడెవరు?" అన్నాడు ఎస్.ఐ.

"మా జీతగాడు...."

"ఏంరా? మేమొస్తున్నమని వాళ్ళకు చెప్పినవా?" అంటూ ఎస్.ఐ. సోమయ్యవైపు రాబోయాడు.

మరుక్షణంలో సోమయ్య రాఘవరెడ్డి పట్టువిడిపించుకొని శక్తికొద్దీ పరుగెత్తసాగాడు.

ఏమైనా సరే- తను పోలీసులకు దొరుకొద్దు. దొరదెబ్బలకే తాళలేకపోయిండు. ఇక పోలీసులు కొడ్తె తను చచ్చిపోతడు. వాళ్ళకు దొరుకొద్దు దొరుకొద్దు... సోమయ్య శివమెత్తినవాడిలా ఎటు దారి కనబడ్తే అటు పిచ్చి వేగంతో పరుగెత్తసాగాడు.

వెంటనే అతన్ని పోలీసులు వెంబడించారు.

"అరేయ్ సోమా, ఆగు.... ఆగు.... ఛస్తవు... ఆగు... పోలీసులు కాల్చి చంపుతరు... ఆగు.... ఆగు.... ఉరకకు ఉరికితివంటే ఛస్తవు"

రాఘవరెడ్డి అరుపుల్ని సోమయ్య లెక్క చేయలేదు. ఇంకొక్క క్షణమైతే తను గుట్టమీది చెట్లల్లోకి దూరిపోతడు. ఇక ఆ తర్వాత తననెవ్వరూ పట్టుకోలేరు.

"ఆగు, ఆగు... పారిపోకు, ఫైర్ చేస్త, ఆగు... ఆగు" అరిచాడు సోమయ్య వెంటే పరుగెత్తుతున్న ఎస్.ఐ.

ఇంకొక్క సెకండ్‌లో సోమయ్య ఆ దట్టమైన చెట్లల్లో కలిసిపోయే వాడే. కాని ఆ లోపలే ఎస్.ఐ చేతిలో ఉన్న రివాల్వర్ మూడుసార్లు పేలింది. సోమయ్య నేల కూలాడు.

.... .... ...

తీవ్రవాదులపై పోలీసులు జరిపిన 'దాడి'లో ఒక తీవ్రవాది మరణించాడన్న పోలీసుల ప్రకటనను ఆ మర్నాడు ఆకాశవాణి అన్ని కేంద్రాలు ప్రసారం చేశాయి. అన్ని వార్తాపత్రికలు ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించాయి.

(పల్లకి వారపత్రిక, 1985)